రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి, వేదికపై ఆయా రంగాల ప్రతినిధులు

సమస్యలపై గళం...

- నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో సమస్యలు ప్రస్తావించిన కార్పొరేటర్లు
- వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం - మంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యేలు గైర్హాజరు

మాట్లాడుతున్న మేయర్ రామయ్య, కమిషనర్ రవీంద్రబాబు

మాట్లాడుతున్న కార్పొరేటర్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కర్నూలు నగరంలో నెలకొన్న పలు సమస్యలపై కార్పొరేటర్లు గళమెత్తారు. కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాన్ని మేయర్ బివై రామయ్య అధ్యక్షతన కొత్తకౌన్సిల్ హాల్‌లో గురువారం నిర్వహించారు. 2025-26 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్, ఎంపిలు బస్తిపాటి నాగరాజు, డాక్టర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరుకావాల్సి ఉండగా వారెవరూ హాజరుకాలేదు. తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం రూ.201.22 కోట్ల రెవెన్యూ రాబడి, రూ.152.98 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.48.24 కోట్ల మిగులుతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కొత్త దుకాణాలు కట్టినా రాబడి ఎందుకు తగ్గించారని కార్పొరేటర్ అర్షియా పర్వీన్ ప్రశ్నించారు. గత అంచనాలకు తగిన ఆదాయం రాలేదని కమిషనర్ రవీంద్రబాబు సమాధానం ఇచ్చారు. అనుమతులు లేకుండా 3, 4 అంతస్తుల భవనాలు కడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మరో కార్పొరేటర్ ప్రస్తావించారు. పార్కుల నిర్వహణ సరిగ్గా లేదని, కూడళ్లలో ఫ్లెక్సీలు కట్టడం వల్ల ఇబ్బంది అవుతోందని కార్పొరేటర్ క్రైప పద్మలతా రెడ్డి చెప్పారు. విగ్రహాలను కప్పేసి ఫ్లెక్సీలు కట్టకూడదని నాయకులు సూచించాలని, కూడళ్లలో ఫ్లెక్సీలు కట్టకుండా గతంలో చేసిన తీర్మానంపై దృష్టిపెడతామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పర్లేదా అని కార్పొరేటర్ శ్వేతారెడ్డి ప్రశ్నించారు. విష్ణు టౌన్‌షిప్‌లో రోడ్డును అక్రమించుకున్నారని నాలుగో సారి చెబుతున్నానన్నారు. ఈ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పరమేష్ కోరారు. కుక్కల బెడద ఎక్కువైందని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. లైసెన్స్‌లు ఆలస్యం అయిందని, త్వరలో అనుమతులు వస్తాయని, స్టెరిలైజేషన్ చేస్తామని కమిషనర్ చెప్పగా స్టెరిలైజేషన్ వల్ల నియంత్రణ కావడం లేదని, వేరే మార్గం ఏమిటని కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసులు అడిగారు. ప్రభుత్వ డాగ్ రూల్స్ ప్రకారమే చేయాలని, ఎక్కువ కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. 38వ సచివాలయం అద్దె కట్టకపోవడం వల్ల ఖాళీ చేయమంటున్నారని కార్పొరేటర్ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయని కమిషనర్ తెలిపారు. ఉల్చాల రోడ్ వైజంక్షన్‌లో సర్కిల్‌కు శంకుస్థాపన చేశారని, పనులు మొదలు పెట్టలేదని కార్పొరేటర్ కృష్ణమూర్తి లేవనెత్తారు. నగరంలో శానిటేషన్ పనులు సక్రమంగా జరగక వీధులన్నీ కంపు కొడుతున్నాయని నాలుగో వార్డు కార్పొరేటర్ అర్షియా పర్వీన్ చెప్పారు. శానిటేషన్ పనులను సక్రమంగా చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ప్రజలకు డెత్ సర్టిఫికెట్ తీసుకునేందుకు బరియల్ సర్టిఫికెట్‌ను అక్కడే ఇచ్చేలాగా చర్యలు తీసుకోవాలని 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి కోరారు. చెన్నమ్మ సర్కిల్ నుండి లక్ష్మీపురం వరకు రోడ్డు విస్తరణ చేసి డివైడర్లు వేయాలన్నారు. శాంతినగర్‌లో కాలువలు మధ్యలో నిలిచిపోయాయని, పనులు చేయాలని కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి కోరారు. టిడ్కో గృహాలు పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మౌలిక వసతులు కల్పించి ఆరు నెలల్లో లబ్ధిదారులందరికీ ఇస్తామని ఎస్ఇ రాజశేఖర్ సమాధానం ఇచ్చారు. వివి ఫంక్షన్ హాల్ వద్ద డిస్పోజల్ డ్రెయిన్ వేసి వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చేయాలని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి కోరారు. సీతారాం నగర్ పార్కును అభివృద్ధి చేయాలని 44వ వార్డు కార్పొరేటర్ ఎం.రాజేశ్వర్ రెడ్డి కోరారు. రంజాన్ మాసం వస్తున్న సందర్భంగా ముస్లిం స్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని 38వ వార్డు కార్పొరేటర్ ఆయేషా సిద్ధిఖీ కోరారు. వచ్చే నెల 12లోగా ఆ పనులన్నీ పూర్తి చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ప్రయివేటుకు మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు

నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్ అభివృద్ధి, సాంకేతిక పనులను శ్రీవాస్త కన్సల్టెన్సీ ఏజెన్సీకి అప్పగించేందుకు అనుమతి ఇచ్చారు. 17 తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 15 ఆర్థిక సంఘం నిధుల కింద చేపట్టిన పనులను ధ్రువీకరించారు. 15 రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపేందుకు ఆమోదం తెలిపారు. పలు కాలనీల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలకు నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు. జొహరాపురం రోడ్డులో పెట్రోల్ పంపు ఏర్పాటుకు ఎన్ఒసి జారీకి ఆమోదించారు. నగర పాలక సంస్థలో పని చేస్తున్న 200 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికుల సేవలను జులై 31 వరకూ పొడిగించారు. గత ఏప్రిల్ నాటికి పనులు దక్కించుకుని 25 శాతంలోపు చేసిన, ప్రారంభించని పనులను రద్దు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఎస్ఇ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ జునైద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కీలక కేటాయింపులు ఇలా..

కార్పొరేషన్ బడ్జెట్‌లో టైం స్కేల్ వేతనాలకు రూ.1.10 కోట్లు, ఔట్ సోర్సింగ్ ఏజన్సీలకు రూ.6.60 లక్షలు, ఎపిసిఒఎస్ ద్వారా కార్మికుల వేతనాలకు రూ.36.02 కోట్లు కేటాయించారు. పారిశుధ్య, పరిరక్షణ పరికరాల కోసం రూ.44 లక్షలు, దోమల నియంత్రణ కోసం రూ.11.11 లక్షలు, మలేరియా పరికరాలకు రూ.16.50 లక్షలు, రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్లు, పార్కుల నిర్వహణ కోసం రూ.90 లక్షలు, నీటి శుద్ధీకరణకు రూ.3.85 కోట్లు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు రూ.3.95 కోట్లు కేటాయించారు. రుణాలుగా రూ.7.50 కోట్లు రావచ్చని అంచనా వేశారు.

నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును

ఉపసంహరించుకోవాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పలు అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు బిఐఎస్ కళ్యాణమండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల ఇండ్ల పన్నులు పెరిగి రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయిరాంరెడ్డి, బ్రిజేస్ సింగ్, ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాహుల్, రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మయ్య మాట్లాడుతూ కార్పొరేట్ రంగానికి సహకరించినట్లుగా నిర్మాణ రంగానికి, స్థిరాస్తి రంగాలను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది నిర్మాణ రంగమేనని తెలిపారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి జాకీర్‌బాష, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మొహిద్దీన్, మహేశ్వరరావు, చంద్రమౌళి, నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం అద్దె విలువపై విధించే ఇంటి పన్నుల విధానాన్ని రద్దుచేసి ఆస్తి విలువపై పన్ను విధించే చట్టం చేసిందన్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే ఇంటి పన్నులు కూడా పెరుగుతాయని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి తగినంతగా పెరగలేదని అన్నారు. నగరంలో దాదాపు వేయి ఇల్లు కొనేవారు లేక నిలిచిపోయాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం భావ్యం కాదన్నారు. ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చి అనంతరం ఆందోళన చేయాలని సమావేశం తీర్మానించింది. మహమ్మద్ యూనుస్, వెంకటేశ్వర్లు, ఎస్ఆర్.గౌడు, సివివర్మ, అన్వర్‌బాష, ప్రభాకర్‌రెడ్డి, పీటర్, శీను తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణరంగం కుదేలయ్యింది

- బిల్డర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బ్రిజేస్ సింగ్

ఇప్పటికే నిర్మాణరంగం కుదేలయింది. మళ్లీ ఇప్పుడు కొత్తగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచితే మరింత ఘోరంగా ఉంటుంది. నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు కూడా రోడ్డున పడే ప్రమాదం ఉంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, ఇంటి పన్నుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

నర్సింగ్ హోమ్‌లను నడపలేని పరిస్థితి ఉంది

- నర్సింగ్ హోమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాహుల్

ఇప్పటికే కర్నూలు నగరంలో అనేక నర్సింగ్ హోమ్‌లను నడవలేక ఉన్నాయి. అనేక నర్సింగ్ హోమ్‌లకు భవనాలను బాడుగకు తీసుకొని నడుపుతున్నాం. ఇప్పుడు మున్సిపల్ ఇంటి పన్నులను పెంచితే మరింత దారుణంగా ఉంటుంది.

ప్రజలపై మరింత భారం పడుతుంది

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బ్రహ్మయ్య

రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటి పన్నులను పెంచితే ప్రజలపై మరింత భారం పడుతుంది. ఇప్పటికే ప్రజలు అనేక భారాలతో ఇబ్బంది పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచకుండా చూడాలి.

పన్నులు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంపు తగదు

- హోటల్ అసోసియేషన్ నాయకులు జాకీర్

రాష్ట్ర అభివృద్ధి పేరుతో ప్రజలపై ఇంటి పన్నుల భారం, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడం తగదు. అవసరమైతే వాటిని తగ్గించి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

గాంధీ కలలుగన్న స్వరాజ్య స్థాపనకు కృషి

-ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జాతిపిత మహాత్మా గాంధీ కలలు గన్న స్వరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు.. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన కర్నూలు రూరల్ మండలం పంచలింగాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపి మాట్లాడుతూ ఆనాడు స్వాతంత్ర కోసం మహాత్మా గాంధీ చేపట్టిన స్వాతంత్ర్య సంగ్రామం స్ఫూర్తిదాయకమన్నారు.. అహింసా వాదమే గాంధీ ఆయుధమని, ఆయన చూపిన అహింసా మార్గంలోనే అందరూ నడవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి నరసింహ

మతోన్మాదాన్ని తరిమికొట్టాలి

- ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశంలో మతోన్మాదాన్ని తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జి.నరసింహ అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నారాయణ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షతన మహాత్మాగాంధీ చిత్రపటానికి నాయకులు, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్యదర్శులు అబ్దుల్లా ,రంగప్ప మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో సిపాయిల తిరుగుబాటు తర్వాత భారత ప్రజలను ఐక్యంగా ఉంచితే బ్రిటిష్ పరిపాలన నడుపుకోవడం కష్టంగా మారుతుందని గ్రహించి భారతదేశంలో మతఉన్మాదాన్ని మతం పేరుతో ప్రజలను చీల్చడానికి బ్రిటిష్ వాడు కుట్ర చేశాడన్నారు. ఆ కుట్రలో భాగంగానే బ్రిటిష్ వాడి పెంపుడు కుక్కల్లాగా మతోన్మాద సంస్థలను ఏర్పాటు చేశారని అన్నారు. ప్రజలందరిని ఐక్యంగా ఉంచడం కోసం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జాతిని ఐక్యం చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని కొనియాడారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యంగా ఉండి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ ప్రపంచంలోనే శాంతియుతంగా కోట్లాదిమందిని ఏకం చేసినా గొప్ప నాయకుడని తెలిపారు. అలాంటి మహాత్మా గాంధీని భారత జాతీయ ఉద్యమాన్ని నడిపిన వ్యక్తిని మత ఉన్మాది నాథురామ్‌గాడ్సే 1948 జనవరి 30న తుపాకితో కాల్చి చంపాడని తెలిపారు. కాల్చింది గాడ్సే అయినా అతను ఆ విధంగా ఉన్మాదంతో తయారవడానికి కారణం ఆర్ఎస్ఎస్ మత ఉన్మాదమని అన్నారు. నేడు మతోన్మాదుల చేతిలో మన భారతదేశం విలవిలలాడుతుందని, అందుకే విద్యార్థులు, యువకులు, ప్రజలంతా ఐక్యంగా ముందుకు కదిలి లౌకిక భారతదేశాన్ని మహాత్మా గాంధీ ఇచ్చిన స్ఫూర్తితో శాంతియుతంగా పోరాడి కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాము, నగర ఉపాధ్యక్షులు అబుబాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ స్థలం కోసం అధ్యయనం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు స్థలం, వసతుల గురించి అధ్యయనం చేయాలని అధికారులకు కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు. అన్ని వసతులు ఉండే స్థలం కోసం పరిశీలించాలని సూచించారు. గురువారం కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కర్నూలు నగరంలోని ఎపి ఇఆర్‌సి, ఎపిఎస్‌పి రెండో బెటాలియనులో పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. అధ్యయనం అనంతరం జిల్లా కలెక్టర్‌కు అధికారులు నివేదిక ఇవ్వనున్నారు.

వర్కూరులో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎసి రాముడు

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని కోడుమూరు ఎంపిడిఒ ఎసి రాముడు గురువారం వర్కూరు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్కూరు ఎస్‌సి కాలనీలో గ్రామ ప్రజలతో మాట్లాడుతూ వలసల నివారణకు ఉపాధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వలసలు వెళ్లకుండా ఉన్న ఊర్లోనే పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకోవాలన్నారు.

కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి వెల్దుర్తి

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి ఎన్నికల హామీలతో కనికట్టు చేసి మాయ చేసిన నారా చంద్రబాబు నాయుడు ఎట్టకేలకు తన ముసుగు మొత్తం తీసేశారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో ఇవాళ ఆ హామీలను నెరవేర్చలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను దగా చేశారన్నారు. సాక్షాత్తు సచివాలయంలోని ప్రకటన చేసి ఎలాంటి సంకోచం లేకుండా భయం లేకుండా చంద్రబాబు నాయుడు మాత్రమే ప్రజల్ని మోసం చేయగలరన్నారు. మాట ఇచ్చి తప్పిన చంద్రబాబును ప్రజలు ఎప్పుడూ మర్చిపోరన్నారు. జగన్ విశ్వసనీయతను కూడా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కాలంలో రూ. 1.19 లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చారన్నారు. మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేశారన్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, క్రిష్ణగిరి మండల కన్వీనర్ ఆర్ బి వెంకటరాముడు మరియు అనుబంధ సంఘాల పత్తికొండ తాలూకా అధ్యక్షులు, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల రహిత సమాజం నిర్మించాలి

మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ డిగ్రీకాలేజీ సదస్సులో మాట్లాడుతున్న టిజి. వెంకటేష్

కుల రహిత సమాజం నిర్మించాలని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ కోరారు. కర్నూలు కెవిఆర్ డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు టికెఆర్ శర్మ శతజయంతి ఉత్సవ సభ క్లస్టర్ విశ్వవిద్యాలయం, సాహితీ సదస్సు కర్నూలు సంయుక్తంగా నిర్వహించారు. గాడిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ, పివి.నరసింహారావు, ప్రకాశం పంతులు, టికెఆర్ శర్మ చిత్రపటాలకు రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్, క్లస్టర్ వర్సిటీ విసి డివిఆర్ సాయి గోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిజి.వెంకటేష్ మాట్లాడుతూ గతంలో కులవృత్తుల ద్వారా కులాలు వచ్చాయన్నారు. ఎంతో మేధా సంపత్తి ఉన్నవారికి కూడా కులం అంటగట్టడం భావ్యం కాదని అన్నారు. విద్యార్థులు కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెంది సమాజ హితానికి పాటుపడాలని సూచించారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి, సిల్వర్‌జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ , సి సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ విజయ్ కుమార్, జెఎస్ఆర్‌కె శర్మ, కావెం సుబ్బలక్ష్మి, హెచ్‌కె. మనోహర్, కెజి.గంగాధర్ రెడ్డి , ఎలమర్తి రమణయ్య, విజయలక్ష్మి, జయ సుశీల, సునీత, పద్మావతి, మణికంఠ తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సిలో గాంధీ వర్ధంతి

హెచ్‌ఆర్‌సిలో గాంధీజీకి ఘన నివాళి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌సి ఉద్యోగులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. గాంధీమహాత్ముని వర్ధంతిని హెచ్‌ఆర్‌సిలోని ప్రజా పౌర సంబంధాల అధికారి పి.హనుమంత రెడ్డి నేతృత్వంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపౌర సంబంధాల అధికారి హనుమంత్‌రెడ్డి కమిషన్ విభాగా అధికారులు జి.సునీత, బొగ్గరం తారక నరసింహ కుమార్, కమిషన్ సిబ్బంది సురేష్ బాబు, నల్లమిల్లి శ్రీనివాసుల రెడ్డి ధనరాజ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కాలేజీలో గాంధీకి నివాళి

ఒకేషనల్ కాలేజీలో

కర్నూలు బికాంప్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహాత్మగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీనారెడ్డి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం.నారాయణరావు గాంధీజీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు.

గాంధేయ మార్గం స్ఫూర్తిదాయకం

నేటి సమాజంలో గాంధేయ మార్గమే ఎంతో స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి.మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. మహాత్మ గాంధీ చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఇతర కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్‌బాబు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, జిల్లా కాంగ్రెస్ ఒబిసి చైర్మన్ డివి సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీజీకి ఘన నివాళి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

డివైఎఫ్ఐ, ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కర్నూలు నగరం ముజఫర్‌నగర్‌లో డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల లేసి నివాళులు అర్పించారు. డివైఎఫ్ఐ నాయకులు శ్రావణ్ అధ్యక్షతన ఐద్వా నాయకులు దానమ్మ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష, నాయకులు సుధాకరప్ప మాట్లాడుతూ విదేశీ బంధనాల నుండి దేశాన్ని విముక్తి చేయాలని, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని, సామ్రాజ్యవాదానికి, మతతత్వానికి వ్యతిరేకంగా జీవితకాలం పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అని తెలిపారు. జాతీయ ఉద్యమంలో ప్రజల పాత్రను గుర్తించి అందుకు అనుగుణంగా పిలుపులను ఇచ్చిన ప్రజా నాయకుడు గాంధీ అని వారు తెలిపారు. ప్రజలందరిని ఐక్యంగా ఉంచడం కోసం మతోన్మాదానికి, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జాతిని ఐక్యం చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని వారు కొనియడారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద సంస్థ ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలు కుల,మతాలతో సంబంధం లేకుండా అన్నదమ్ముళ్ల కలిసి ఉండే భారతదేశ ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చుపెట్టి ప్రజలను చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యంగా ఉండి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డిఐఎఫ్ఐ నాయకులు విజయ్, ఐద్వా నాయకులు శారదమ్మ, కన్యక, కుమారి సువార్తమ్మ, స్థానిక వార్డు నాయకులు బషీర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముజఫర్‌నగర్‌లో గాంధీకి నివాళ్లు అర్పిస్తున్న డివైఎఫ్ఐ,ఐద్వా నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలి

హోసూరు దగ్గర తూము ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, హోసూర్ దగ్గర తూము ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఈశ్వర్ రెడ్డి భవనంలో పత్రికా విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు వేగవంతంగా చేసి, సాగు భూములకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత రైతులందరూ వర్షాధారంపై పంటలు పండిస్తున్నారన్నారు. సాగునీరు అందించడం వల్ల వలసలు నివారించవచ్చని అన్నారు. ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలని, తూములు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి నిమ్మల రామానాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్యాంకుమార్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాష స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతు వాణి డైరీ , క్యాలెండర్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన డైరీని ,క్యాలెండరును గురువారం జిల్లాలో ముఖ్యమైన అధికారులు డిఆర్ఒ, ఆర్‌డిఒ, తహశీల్దార్. ఎండోమెంట్ , మార్కెట్ యార్డ్ , వ్యవసాయ శాఖ అధికారులకు తదితర జిల్లా అధికారులకు అందజేసినట్లు ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రైతాంగ పోరాటాలకు తమలాంటి మేధావులు, అధికారుల మద్దతు సంపూర్ణంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరగబోయే రైతాంగ పోరాటాలకు మరింత సహకారాన్ని అందించి రైతు ఉద్యమాలను బలపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతాంగ సమస్యలపై 2025- 26 సంవత్సరం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు స్పందిస్తూ ఎపి రైతు సంఘం బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

సూచనలు, సలహాలు ఇస్తున్న సబ్ కలెక్టర్

ప్రమాదాలు జరగకుండా చూడాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం కార్యాలయంలో రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లలో అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధిక లోడ్తో ప్రయాణికులను తరలించకుండా నిఘా పెట్టాలన్నారు. డీఎస్పీ హేమలత, ఆర్టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ దీప్తి, ఉపేంద్ర, ఆర్అండ్బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి ఉన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- జడ్పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పి సిఇఒ

మండలంలోని 33 గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జడ్పి సిఇఒ నాసర రెడ్డి ఎంపిడిఒ గీతావాణిని ఆదేశించారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో చెడిపోయిన బోర్లు, పగిలిపోయిన పైపులైన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ అనుమేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రుతి పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని బాపురం పంపు హౌస్ను జడ్పి సిఇఒ నాసర రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి నిల్వలను తరచూ పరిశీలించాలని, నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిఎల్డిఒ అనురాధ, డిఇ మల్లికార్జున, ఎంపిడిఒ వరలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరమణి పాల్గొన్నారు.

పెద్ద షేకన్న మృతి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నివాళి - శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆదోని

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

టిడిపి సీనియర్ నాయకులు పెద్ద షేకన్న మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు విచారం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గోనబావి గ్రామంలో పెద్ద షేకన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్ద షేకన్న టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగారని తెలిపారు. పెద్ద షేకన్న 104 ఏళ్లు జీవించడం గొప్ప విషయమని చెప్పారు. ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. షేకన్న కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - చిప్పగిరి

సూచనలు చేస్తున్న సిహెచ్ఒ వెంకటేశ్వర్లు

మండలంలోని నంచర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పర్శ, కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయులు వినోద్కుమార్ ఆధ్వర్యంలో సిహెచ్ఒ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 13 వరకు స్పర్శ, కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమిష్టి కృషితో కుష్టు రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వేల ప్రకారం ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎల్సిడిసి వెరిఫికేషన్ చేపడుతున్నామన్నారు. నంచర్ల పాఠశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

- ఫిబ్రవరి 10న ధర్నా
- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

మిరప రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని, సహాయం కోసం ఎదురుచూస్తున్నా పట్టించుకునే వారే లేరని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు విమర్శించారు. గురువారం ఆదోని మండలం హనవాళు గ్రామంలో మిరప రైతులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో మిరపను అమ్ముకోలేక కళ్లల్లోనే నిల్వ ఉంచుకున్నారని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలకు బీమా పరిహారం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. క్వింటాకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు కనీస మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హనవాలు గ్రామంలో కడ్డీ బ్యాడిగి మిరప కాయలను పరిశీలించినట్లు తెలిపారు. ఈఏడాది వాతావరణంలో చోటు చేసుకున్న ప్రతికూల పరిస్థితులు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. వర్ష ప్రభావం వల్ల పంట పూర్తిగా దెబ్బతిందని, ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఎకరాకు రూ.50 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది కూడా ఇదే పరిస్థితిని రైతులు ఛిదించాల్సి వచ్చిందన్నారు. గతేడాది ధర లేక ఎసి గోడౌన్లో నిల్వ చేసి ఎక్కువ మంది రైతులు నష్టపోయారని తెలిపారు. మిరప రైతులకు ఆర్థిక సహాయం ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంట నష్టపరిహారం, గిట్టుబాటు ధర కోసం ఫిబ్రవరి 10న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాషా, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, రైతులు ఉన్నారు.

రైతుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కనుల పండువగా ఆరాధనోత్సవాలు

- చింతల ముని, నల్లా రెడ్డి స్వాములను దర్శించుకున్న భక్తులు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలిసిన శ్రీచింతల ముని, నల్లా రెడ్డి స్వాముల 35వ ఆరాధనోత్సవాలు గురువారం కనుల పండువగా సాగాయి. ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వైసిపి నాయకులు బాణసంచా కాల్చి, శాలువా కప్పి పూలమాలలతో ఎమ్మెల్యే విరుపాక్షికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఉదయం స్వామివారికి ప్రాతఃకాల పూజ, పంచామృతాభిషేకం, రుద్ర హోమం, నవగ్రహాల వాస్తు హోమం, ఉధ్వాసన మంగళ హారతి తదితరుల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక పక్క మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. సర్పంచి శంకరమ్మ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గిరి, జిల్లా కార్యదర్శి పెద్దయ్య, మండల కన్వీనర్ బసవరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, ఆలూరు యూత్ అధ్యక్షులు అశోక్, రైతు విభాగం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కళాకారుల విభాగం అధ్యక్షులు లక్ష్మన్న, వైసిపి సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, సీనియర్ జర్నలిస్టు వెంకప్ప, సర్పంచులు హరికృష్ణ, వెంకటేష్, మండల నాయకులు మునిస్వామి, దస్తగిరి, వెంకటేష్, పాండు, రాజన్న, రంగముని, ప్రకాష్, శివ, లక్ష్మణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న నాయకులు

ఉద్యోగం తీసేసేందుకు కుట్ర

- పోలీసు స్టేషన్లో బాధితురాలి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆలూరు

అడిగిన డబ్బు ఇవ్వనందుకు ఆలూరు కెజిబివి-4 బాలికల హాస్టల్ (ఎపి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్)లో చౌకీదర్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న తనను పోస్టు నుంచి తీసేసేందుకు ప్రిన్సిపల్ రాఘవ రావు, వార్డెన్ సుధారాణి కుట్ర పన్ను తున్నారని డిహెచ్.లక్ష్మిదేవి వాపోయారు. గురువారం ఆమె ఆలూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ... ఆర్సి నెంబరు 1480/ఎ3/కెజిబివి 2024న రిక్రూట్మెంట్ జరిగిందని, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్లో చౌకీదర్గా నవంబరు 18, 2024న కర్నూలు డిఇఒ ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. నవంబరు 23, 2024న పోస్టులో చేరి డిసెంబరు 23, వరకు పని చేసినట్లు చెప్పారు. ప్రిన్సిపల్, వార్డెన్ కలిసి హాస్టల్తో పాటు తమ ఇళ్లలో పని చేయాలని తెలిపారని అన్నారు. హాస్టల్లో మాత్రమే పని చేస్తానని తెలిపానన్నారు. 23న తనను ప్రిన్సిపల్, వార్డెన్ పిలిపించి 'నీ జీతం కోసం బిల్లు పెట్టాలి. సంతకం చేయమ'ని తెల్ల కాగితంపై సంతకం చేయించుకొని రాజీనామా చేసినట్లు తనకు తెలియకుండా డిఇఒకు పంపించారన్నారు. తనకు తెలిసిన వెంటనే అడగగా 'నీ జీతంలో సగం మాకు ఇవ్వాలి. లేకపోతే రూ.3 లక్షలు ప్రిన్సిపల్కు, రూ.2 లక్షలు వార్డెన్కు ఇవ్వాల'ని కోరారని తెలిపారు. తాను, తన భర్త ప్రిన్సిపల్ కాళ్లు పట్టుకొని అడగగా 'సరే చూద్దాం' అని చెప్పి చివరికి 'నిన్ను తొలగించార'ని చెప్పారని అన్నారు. తనను నమ్మించి తెల్ల కాగితంపై సంతకం చేయించుకొని, డబ్బులు డిమాండ్ చేసి ఉద్యోగాన్ని తొలగించేందుకు కుట్ర పన్నిన ప్రిన్సిపల్ రాఘవరావు, వార్డెన్ సుధారాణిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆలూరు పోలీసులను కోరినట్లు తెలిపారు.

వలస వెళ్లొద్దు.. ఉపాధి కల్పిస్తాం...

- ఎంపిడిఒ పుల్లయ్య - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం

వలస వెళ్లొద్దని, ఉపాధి కల్పిస్తామని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. బుధవారం ప్రజాశక్తి ప్రచురించిన 'ఆగని వలసలు' కథనానికి అధికారులు స్పందించారు. ఎంపిడిఒ పుల్లయ్య, ఎపిఒ శ్రీనివాసులు, ఇఒఆర్డి సందీప్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి గురువారం నందవరం ఎస్సీ కాలనీని సందర్శించారు. వీధి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. వీధి ప్రజలు వలస వెళ్లవద్దని, ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని తెలిపారు. బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇక్కడే ఉపాధి కల్పించి రూ.300 వేతనాలను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. సంవత్సరాలుగా పనికి వెళ్లకపోవడం వల్ల జాబ్ కార్డులు బ్లాక్ అయ్యాయని, వాటిలో 46 జాబ్ కార్డులను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రజలకు సోమవారం నుంచే ఉపాధి హామీ చట్టాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. పని చేసే ప్రతి వ్యక్తికీ బ్యాంక్ అకౌంట్ కచ్చితంగా ఉండాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ పుల్లయ్య

పోస్టు కోసమే...

- ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్య
- డీఎస్పీ వెంకట్రామయ్య

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసమే బండారి ఈరన్నను నిందితులు హత్య చేసినట్లు డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. గురువారం నిందితులను మీడియా సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మృతుని భార్య బండారు నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈరన్న హత్య కేసులో దబ్బల గాదిలింగ, మంగలి గోపి, దబ్బల వర్ధన్, బొగ్గుల ఈరన్న, బోయ రామదాసుపై అనుమానం ఉన్నట్లు ఆమె తెలిపారని అన్నారు. బండారి ఈరన్న 2019 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం మారిన తర్వాత అదే గ్రామానికి చెందిన దబ్బల గాదిలింగ, మంగలి గోపి, బొగ్గుల ఈరన్న, బోయ రామదాసులు బండారి ఈరన్న ఇంటికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రాజీనామా చేయాలని బెదిరించినట్లు తెలిసిందన్నారు. ఈరన్న రాజీనామా చేయకుండా పోస్టు అలాగే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుసుకున్న నిందితులు బైక్పై వెళ్తున్న బండారి ఈరన్నపై దాడి చేశారని తెలిపారు. బొగ్గు రామన్న పొలం దగ్గర కాపు కాచిన దబ్బల గాదిలింగ ఈరన్న అక్కడికి చేరుకోగానే కంట్లో కారం కొట్టి గొడ్డలితో వెనుక నుంచి మెడపై నరకడంతో ఒక్కసారి కుప్పకూలగా గాదిలింగ, వర్ధన్లు గొడ్డలితో విచక్షణ రహితంగా నరికారని చెప్పారు. కురుకుంద మహేష్ పొలం గట్టుపై ఉండి ఎవరూ గమనించకుండా అక్కడ ఉన్నట్లు తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే కుట్ర పన్ని నిందితులు హత్య చేసినట్లు చెప్పారు. దబ్బల గాదిలింగ, దబ్బల వర్ధన్ను ఆలూరు వై జంక్షన్లో, కురుకుంద మహేష్ను అరికెరలోని తన ఇంటి దగ్గర అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ఒక గొడ్డలి, మూడు బైక్లు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బండారి ఈరన్నను బెదిరించిన ముగ్గురిపై, హత్య చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచి రిమాండ్కు పంపినట్లు చెప్పారు. సిఐ వెంకట చలపతి, ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్, హాలహర్వి ఎస్ఐ చంద్ర పాల్గొన్నారు.

నిందితులను చూపిస్తున్న డీఎస్పీ, సిఐ, ఎస్ఐ

వికలాంగులు, దళితుల హక్కుల పోరాటాల ఫలితమే

మందకృష్ణకు పద్మశ్రీ : విహెచ్పిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వికలాంగులు, దళితుల హక్కుల పోరాటాల ఫలితంగానే మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వచ్చిందని విహెచ్పిఎస్, ఎంఆర్పిఎస్ నాయకులు తెలిపారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా గురువారం ఎమ్మిగనూరులో వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్), ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బీసీ.సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు గుడికల్ బి.శ్రీనివాసులు, ఎంఎస్పి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్ చైతన్య మాదిగ పాల్గొని విహెచ్పిఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వికలాంగుల హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ కృషి చేశారని తెలిపారు. వారి ఫలితంగా పద్మశ్రీ వచ్చిందని చెప్పారు. తాలూకా గౌరవాధ్యక్షులు బి.తిక్కయ్య, తాలూకా ప్రధాన కార్యదర్శి బి.పెద్దయ్య, విహెచ్పిఎస్ గోనెగండ్ల మండల అధ్యక్షులు సుంకన్న, మండల ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, నందవరం మండల ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, ఎంఎస్పి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్ చైతన్య మాదిగ, ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహాదేవ్ మాదిగ, ఎం.నాగ రాజు, మంత్రాలయం భీమేష్, పార్లపల్లె సురేష్, గుడికల్ సుధా పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో అడ్డదిడ్డంగా వాహనాలు నిలపరాదని, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత హెచ్చరించారు. గురువారం ట్రాఫిక్ రూల్స్పై ఆటో డ్రైవర్లతో సిఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆటోల ద్వారా ఆర్టిసి బస్టాండ్ నుంచి పోలీసు కంట్రోల్ రూమ్, భీమా సర్కిల్, ప్రభుత్వాస్పత్రి మీదుగా ఆర్టిసి బస్టాండ్ వరకు ఆటో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల గురించి వివరించేందుకు ప్రతి ఏడాది జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలుగుతోందని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించటంలో ముఖ్య పాత్ర పోషించాలని తెలిపారు. అలాగే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. సిఐలు సూర్య మోహన్ రావు, నల్లప్ప, ఆటో యూనియన్ (సిఐటియు) నాయకులు తిప్పన్న ఉన్నారు.

'సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలి'

ప్రజాశక్తి - కౌతాళం

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా ఉన్న బుడగ జంగాల కాలనీలో సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని ఎంపిడిఒ సుబ్బరాజుకు, ఇఒఆర్డి యోగేశ్వర్ రెడ్డికి ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. గురువారం కాలనీ వాసులు సయ్యద్ దూద్బాషా, నాగరాజు, నరసప్ప, ప్రహ్లాద, జంబయ్య మాట్లాడారు. ఈ కాలనీపై ఉన్న ఆయకట్టు పొలాల నీళ్లు, వర్షాకాలంలో వచ్చే నీరు ఈ కాలనీలో ప్రవహించడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆ నీరు కాలనీలో నిల్వ ఉండడంతో దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. అధికారులు సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE
IX ADDL CHIEF JUDGE
CITY CIVIL COURT
AT :: HYDERABAD
O.P .No .2026 of 2022

Between:
Kashapogu Chittemma and Others ...Petitioners
AND
Shaik Alam Basha and Others …Respondents

To,
Shaik Shavali S/o B.Garib Sab, aged about:Major Occ: driver of Crime vehicle,R/o H.No. 2-93, B C Colony, Neraniki, Holagunda,Kurnool District,AP. Pin: 518395.

Please take notice that the above OP is filed for Claiming Compensation. against the Respondents 1to 3 and the case stands posted to 10-02-2025, at 10-30 am for your appearance. If any person or through your counsel on the said date, if not appear the OP will be heard and determined in your absence.

[By order of the Court]

G. BRAHMANAD REDDY
Advocates for Petitioners
9-1-43/53/17/C,
Prashanth Nagar,
Langer House, Hyderabad.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి మాజీ ఎంపిపి శంకరయ్య ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని బోడబండ-చెన్నాపురం రోడ్డు మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటెకల్ గ్రామానికి చెందిన గాంధాళం సామ్యేల్, కుమారుడు గౌతం మృతి చెందడం బాధాకరమన్నారు. సామ్యేల్ భార్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గురువారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తరపున బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కురువ సాధికారక కర్నూలు పార్లమెంట్ కమిటీ సభ్యులు కెటి.వెంకటేష్, టిడిపి సోగనూరు గ్రామ అధ్యక్షులు జగదీష్, ఈరన్న, పంపయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎంపిపి శంకరయ్య

ప్రాజెక్టుల నిర్మాణం సర్వే చేపట్టాలి

- తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని/కౌతాళం

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం సర్వే చేపట్టాలని, ఇప్పటికే ఆదేశించినా పనులు ముందుకు సాగడం లేదని, వెంటనే సర్వే పనులు చేపట్టాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. గురువారం కర్నూలు నగరంలోని జలవనరుల చీఫ్ ఇంజినీర్ ఖాదర్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. జిల్లాలోని సాగునీటి వసతిని అంచనా వేస్తూ డిపిఆర్ తయారు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న వలసల నివారణ, వ్యవసాయం అభివృద్ధికి, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. సాగునీటి వసతి ఉందని, ప్రాజెక్టుల నిర్మాణానికి జిల్లా నుంచి అధికారులు ప్రత్యేకంగా సర్వే పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఏడాది వేదవతి నది నుంచి సుమారు 200 టిఎంసిల వరదనీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని చెప్పారు. ఈ నీటిని వాడుకోవడానికి గుంతకల్ - బళ్లారి రహదారిలో హగరి వద్ద ఒక ప్రాజెక్టు నిర్మించి గ్రావిటీ ద్వారా వేదవతి ప్రాజెక్టుకు అనుసంధానం చేసి 60 టిఎంసిల నీటిని జిల్లాకు కేటాయిస్తే సుమారు 6 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో సాగునీటి రిజర్వాయర్లు నిర్మించాలన్నారు. ఎల్ఎల్సి కెనాల్కు 50 కిలోమీటర్ల వద్ద సిరిగేరి గ్రామం (కర్నాటక) నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో 251 కిలోమీటర్ల హనవాలు గ్రామం వరకు షార్ట్కట్ అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మించి ఎల్ఎల్సికి అనుసంధానం చేయాలని కోరారు. కౌతాళం మండలం మేళిగనూరు వద్ద భారీ స్థాయిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తుంగభద్ర నదిపై నిర్మిస్తే సుమారు 2 లక్షల ఎకరాలకు నీటి వసతి ఏర్పడుతుందన్నారు. ఆర్డిఎస్, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. తుంగభద్ర నది తీరాన ఉన్న కౌతాళం నుంచి సి.బెళగల్ మండలాల వరకు తుంగభద్ర నదిపై ఉన్న 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల సామర్థ్యం పెంచి అదనంగా నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్రప్రదేశ్ వాటాగా 734 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా, ఎల్ఎల్సి ద్వారా కేవలం 250 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో నీటిని సాధించాలని కోరారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

'సంక్షేమం'పై చేతులెత్తేసిన బాబు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులెత్తేశారని, ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తూ తన నైజాన్ని బయట పెట్టుకున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని రాంపురంలో ఉన్న ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వైసిపి పాలనలో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని బాబు విమర్శించారని చెప్పారు. అలాంటి వారు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చి కేవలం పింఛను మాత్రమే పెంచారని, మిగిలిన సంక్షేమ పథకాలను అమలు చేయలేక భయమేస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు కూటమి నాయకులు సాధ్యం కానీ పథకాలను అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారం వచ్చిన తర్వాత విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సందప సృష్టించాలని చెప్పిన ముఖ్యమంత్రి ఎంత సృష్టించారో తెలపాలని కోరారు. ఇప్పటికే రూ.1.19 లక్షల కోట్లు అప్పు తెచ్చారని, ఈ డబ్బుతో పింఛన్లు, ఒకే ఒక సిలిండర్ మాత్రమే మహిళలకు ఇచ్చారని తెలిపారు. నాడు విద్యుత్ బిల్లులు పెరిగాయని వైసిపి ప్రభుత్వంపై 'బాదుడే.. బాదుడు' చేపట్టిన చంద్రబాబు నేడు విద్యుత్ బిల్లులు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. లోకేష్ 'రెడ్ బుక్' అం టూ ప్రతి పక్ష నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అక్రమ కేసులతో వైసిపి నాయకులను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజలు ఆలోచిస్తున్నారని, నాటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బాగుండేదని భావిస్తున్నట్లు తెలిపారు. నిజాలను బయట పెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మీడియా సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఎల్లప్ప, నాయకులు జక్కయ్య, చెట్నిహల్లి ఉప సర్పంచి వీరనాగప్ప, మారెప్ప పాల్గొన్నారు.

కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

కెవిపిఎస్ నూతన సంవత్సర డైరీని ఎస్ఐ శివాంజుల్ ఆవిష్కరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్లో కెవిపిఎస్ మండల కార్యదర్శి జి.అంజి ఆధ్వర్యంలో డైరీని ఆవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, వ్యకాస మండల అధ్యక్షులు టి.లక్ష్మన్న, కెవిపిఎస్ మండల అధ్యక్షులు సురేష్, మండల నాయకులు మారెప్ప, డి.ఇజ్రాయేలు, దేవా, కమిటీ సభ్యులు చిన్న తిక్కన్న, చిన్న అంజనేయ, హనుమంతు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గుట్కా అమ్మకాలు

- బానిసవుతున్న యువత
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని గుట్కా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చిన్న, పెద్ద అని తేడా లేకుండా అంగళ్లలో అమ్మకాలు జరిపి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గుట్కాకు యువత బానిస అవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

మండలంలోని ప్రతి గ్రామంలోనూ గుట్కా అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కొంతమంది మహిళలు సైతం అందులో ఉన్న మత్తుకు బానిసై గుట్కా లేనిదే రోజు గడవదనే స్థితికి చేరినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా సాగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి మంచి నీరు దొరుకుతాయో లేదో తెలియదుగానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి.. అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు విమర్శిస్తున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులు అధిక లాభాలు గడిస్తున్నారు. ఎక్కువ శాతం కార్మికులు, యువకులు, యువతులు, మధ్యతరగతి మహిళలు సైతం గుట్కాకు బానిసైనట్లు తెలిసింది. మానసిక రోగాలు, నోటి క్యాన్సర్తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వస్తున్నట్లు వైద్యాధికారి పేర్కొంటున్నారు. సినిమా థియేటర్లోనూ విరామ సమయంలో గుట్కా, తంబాకు ప్రాణాంతకమైనవని ప్రచారాలు చేస్తున్నా యువత పెడచెవిన పెడుతోంది. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.200 నుంచి రూ.300 వరకు వ్యాపారులు అమ్ముకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రాష్ట్రాల మధ్య గుట్కా అమ్మకాలు, అమలులో తేడా

రాష్ట్రాల మధ్య గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలు, వివిధ కార్యకలాపాలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలో తేడాలు ఉండడం వల్ల వ్యాపారులు చెలరేగిపోతున్నట్లు తెలిసింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయం గా గుట్కా తయారీకి అనుమతిస్తూ అమ్మకాలు జరుపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న వయస్సులోనే గుట్కాకు బానిసలుగా మారడంతో అనారోగ్యం పాలవడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నట్లు వాపోతున్నారు.

కేంద్రం పటిష్టమైన చట్టం అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వం గుట్కా, మత్తు పదార్థాలు అమ్మకాలపై జోక్యం చేసుకోవాలని, పటిష్టమైన చట్టం అమలు చేయాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని మత్తు పదార్థాలు తయారు చేసుకొని అమ్మకాలు జరుపుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఇవ్వడం, మరికొన్ని రాష్ట్రాల్లో మత్తు పదార్థాలు, గుట్కాపై నిషేధాలు విధిస్తున్నాయి. నిషేధించిన రాష్ట్రాలకు అధిక సంఖ్యలో మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. కర్ణాటక రాష్ట్రంలో గుట్కా తయారీ, అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్రాలో మాత్రం గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలు నిషేధం. కర్ణాటక రాష్ట్రం 5 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల వెంటనే రవాణా జరిగి మత్తు పదార్థాలు ఆంధ్రాకు చేరుకుంటాయి. రాష్ట్రాల మధ్య తేడాలు ఉండొచ్చు. గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలు ఏ రాష్ట్రంలోనూ జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టం అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహారాజ శ్రీ కర్నూలు ఆదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.30/2023

M/s BANK OF BARODA,
Before merged i.e., before 01-04-2019
in Bank of Baroda) it is called as
M/s, Vijaya Bank),
Bellary Road, Kurnool city, Kurnool
(M & District).
Pin No.518001,Rep. by its Branch Manager i.e.,
Present T.Naresh Gandhi. ...Plaintiff's

-Vs-

P.SriLatha (Proprietor of M/s. Excel Industries)
...Defendants

ప్రతివాదికి దావా సమన్లు

పి.శ్రీలత తండ్రి పి.వెంకటేశ్వర్లు
(ప్రొప్రైటర్ ఆఫ్ యం/యస్.ఎక్సల్ ఇండస్ట్రీస్)
వ్యాపారం, ఇంటి.నెం.87/288, (గ్రౌండ్ ఫ్లోర్)
కమలనగర్, రవీంద్రస్కూలు దగ్గర, కర్నూలు.
ప్రస్తుతం నివాసం,ఇంటి.నెం.37-7డి,
కె.వి.ఆర్.గార్డెన్, ఉస్మానియా కాలేజి రోడ్డు,
కర్నూలు సిటి.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీరు వాది దగ్గర తీసుకున్న బాకీ బాపత్తు రూ.28,50,235/-లు అసలు వడ్డీ కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 20-2-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడ మైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 20-2-2025

పి. గోపాల్,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.